ట్రాఫిక్ నిబంధనలపై 2కే వాక్



కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు కట్టపై 2కే వాక్ నిర్వహిస్తున్న విద్యార్థులు, ట్రాఫిక్ పోలీసులు

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు కట్టపై కళాశాల విద్యార్థులతో కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని (2కే వాక్) నిర్వహించారు. కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని 2కే వాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలన్నారు. హెల్మెట్ పెట్టుకోవడంతో ప్రాణాలు కాపాడుకోచ్చన్నారు. అతి వేగంతో డ్రైవింగ్ చేయడంతో ప్రాణాలకే ప్రమాదమన్నారు. కూకట్‌పల్లిలో ఎక్కువగా కళాశాలలు ఉన్నాయని ఒకేసారి విద్యార్థులు బయటకు రావడంతో ట్రాఫిక్ జామ్ అవుతోందన్నారు. జీబ్రా క్రాసింగ్‌పై ట్రాఫిక్ సిగ్నల్స్ గమనిస్తూ రోడ్డు దాటాలని విద్యార్థులకు సూచించారు. పలు ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నగేష్, ఆర్‌ఐ శేఖర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

వర్షపునీరు కాలనీల్లోకి చేరకుండా పనులు చేపట్టాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


రంగదాముని చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, అధికారులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రంగదాముని చెరువు నుంచి ప్రవహించే వర్షపు నీరు, మురుగు స్వాన్ లేక్ మీదుగా కూకట్‌పల్లి నాలాలో కలుస్తుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. నాలా సరిగా లేకపోవడంతో భారీ వర్షాలు కురిసినప్పుడు స్వాన్‌లేక్ అపార్టుమెంట్‌లో వర్షం నీరుచేరి దాదాపు 200 కార్లు మునిగిపోయాయని తెలిపారు. అదే విధంగా ఈ నాలా నుంచి వచ్చే వర్షపు నీరు వల్ల కూకట్‌పల్లి బస్ డిపో వద్ద నీరు నిలిచిపోతోందన్నారు. దీంతో బస్సుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఆయన అధికారులకు తెలిపారు. రంగదాముని చెరువు నుంచి కూకట్‌పల్లి డిపో వరకు ఇరిగేషన్ అధికారులు, ఎంఆర్‌ఓ, జీహెచ్‌ఎంసీ అధికారులు సమన్వయం చేసుకొని వీలైనంత త్వరగా పనులు పూర్తి చేస్తే వర్షాకాలంలో ఈ సమస్య తలెత్తదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌ఓ స్వామి, టౌన్ ప్లానింగ్ సీపీ ఉమాదేవి, ఏసీపీ మల్లీశ్వర్, ఇరిగేషన్ ఈఈ నారాయణ, మాజీ కార్పొరేటర్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులు భయాన్ని వీడి చికిత్స చేయించుకోవాలి


కుష్ఠువ్యాధి నిర్మూలనకు ప్రతిజ్ఞ చేస్తున్న మార్కెట్ కమిటీ డైరెక్టర్, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు

మూసాపేట: మూసాపేటలోని వార్డు కార్యాలయం వద్ద బుధవారం కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ డైరెక్టర్ జిల్లా గోపాల్ మాట్లాడుతూ.. వ్యాధిగ్రస్తులు భయాన్ని వీడి చికిత్స చేయించుకోవాలన్నారు. 3 నుంచి 5 సంవత్సరాలలో వ్యాధి లక్షణం బయటపడుతుందన్నారు. ఇది చర్మానికి ఆ తర్వాత నరాలకు సోకుతుందన్నారు. ప్రారంభ దశలో చికిత్స చేయించుకుంటే అంగవైకల్యం రాదని తెలిపారు. జాగురుకతతో ఉండి కుష్ఠు వ్యాధిని నిర్మూలించవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు, స్థానిక నాయకులతో కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఏఎన్ఎం స్వప్న, ఆశవర్కర్ నాగమణి, సుమ, తులసీ, మానస పాల్గొన్నారు.

మల్లు రవికి శుభాకాంక్షలు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమితులైన మల్లు రవిని టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం గాంధీ భవన్‌లో మల్లు రవిని ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ యాదవ్, నాయకులు షాయిన్‌షా, అశోక్‌యాదవ్ శాలువాతో సత్కరించారు. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా మల్లు రవిని నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసుల సేవలపై అవగాహన

మోతీనగర్: శ్రీ వివేకానందనగర్‌లోని శ్రీసాయి చైతన్య హైస్కూల్‌లో విద్యార్థులకు పోలీసుల సేవలపై పోలీసు ఉన్నతాధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అల్లాపూర్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు మాట్లాడుతూ.. నేరాలు ఎందుకు జరుగుతాయి? వాటిని ఎలా అరికట్టాలి? ఎటువంటి నేరాలకు ఎలాంటి శిక్షలు పడతాయి? అనే అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా హైస్కూల్ చైర్మన్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సమాజం పట్ల పోలీసులకు ఉన్న నిబద్ధతకు ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లిలోని అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్ డిగ్రీ విద్యార్థుల రెండు రోజుల స్పోర్ట్స్ మీట్ 'గేమ్స్ గలోర్'బీహెచ్‌ఈఎల్ స్టేడియం, రామచంద్రాపురంలో కళాశాల చైర్మన్ అవినాష్ బ్రహ్మదేవర నేతృత్వంలో ప్రారంభమైంది. ఈ క్రీడలను కళాశాల ప్రిన్సిపాల్ మల్లాది ఫణిమాల జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. విద్యార్థులు ఫ్లాష్‌మాబ్, క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, త్రోబాల్, ఖోఖో వంటి క్రీడల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఫణిమాల మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, ఉత్సాహం పెరుగుతుందన్నారు. ఈ క్రీడలు రెండు రోజుల పాటు నిర్వహించినట్లు తెలిపారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

ఆల్విన్‌కాలనీ: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు, సృజనాత్మకతలు వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపయోగపడతాయని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలల తెలంగాణ రీజనల్ కో–ఆర్డినేటర్ ఆరోగ్యరెడ్డి అన్నారు. వివేకానందనగర్, సప్తగిరికాలనీలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో బుధవారం జరిగిన సైన్స్ ఫెయిర్ జరిగింది. ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు థర్మల్ పవర్ ప్లాంట్, పొల్యూషన్, గుండె పనితీరు, రోబోటిక్, నీటి పరిశుద్ధత, తదితర ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సెంట్రల్ డివైడర్ పనులకు సహకరించాలి


ఆదిత్యనగర్‌లో సెంట్రల్ డివైడర్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్, పోలీసులు, అధికారులు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్‌లో చేపట్టనున్న సెంట్రల్ డివైడర్ నిర్మాణ పనులను, ట్రాఫిక్ మళ్లింపు విధివిధానాలపై హెచ్‌ఎంటీహిల్స్, ప్రగతినగర్ రోడ్డుపై చేపట్టనున్న మంజీరా పైపులైన్ లీకేజీ మరమ్మతు పనులను బుధవారం కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ఆదిత్యనగర్‌లో చేపట్టే సెంట్రల్ డివైడర్ నిర్మాణ పనులకు ప్రజలు సహకరించాలన్నారు. పనుల నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపుపై కేపీహెచ్‌బీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ సూచనలను పాటించాలని కోరారు. జేఎన్‌టీయూ ప్రధాన రహదారి నుంచి అడ్డగుట్ట, హెచ్‌ఎంటీ హిల్స్, ఆదిత్యనగర్ మీదుగా ప్రగతినగర్‌కు నిత్యం వేల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయని తెలిపారు. డివైడర్ నిర్మాణ పనులు చేపట్టే సమయంలో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

◆ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న వాటిని తొలగించాలని సూచించారు. స్థానికులు వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేసి ఇతరులకు ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. అదే విధంగా రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని హెచ్‌ఎంటీ హిల్స్‌లో లీకేజీ అవుతున్న పైపులైన్‌లను గుర్తించి సరిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. డివిజన్‌లో ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా కిందిస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాజీవ్, వర్కు ఇన్‌స్పెక్టర్‌లు మహదేవ్, దేవి, ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, కాలనీవాసులు వెంకట్‌రెడ్డి, రాంబాబు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తా



కూకట్‌పల్లి: బస్తీ, కాలనీల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. బుధవారం బాలానగర్‌లోని ఐడీపీఎల్, ఇందిరానగర్ బస్తీ కమ్యూనిటీహాల్‌లో జరిగిన సమావేశంలో స్థానికులు పలు సమస్యలను బండి రమేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, నాగిరెడ్డి, పుష్పరెడ్డి, యుగంధర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ నాలా పనులు పూర్తి చేయండి

ఉపముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేత

మోతీనగర్: మూసాపేట, అల్లాపూర్ డివిజన్‌లలోని ఇళ్ల మధ్యలో ఉన్న ఓపెన్ నాలా విస్తరణ పనులను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు బుధవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కబీర్‌నగర్ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు కడపన గోపాల్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వి.రామారావునగర్ నుంచి స్నేహపురికాలనీ, కబీర్‌నగర్, బబ్బుగూడ, అవంతినగర్ తోట వరకు ఇళ్ల మధ్యన ఉన్న ఓపెన్‌నాలా విస్తరణతో పాటు పై కప్పు పనులు గత ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. కానీ పనులు పూర్తి కాకపోవటంతో నాలాపై కప్పు పూర్తి కాకపోవటంతో వృద్ధులు, చిన్నారులు నాలాలో పడిపోయి కాళ్లు, చేతులు విరగ్గొట్టుకున్న సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. వర్షం పడితే తిరిగి వర్షపు నీరు, డ్రైనేజీ నీరు ఇళ్లల్లోకి వచ్చే ప్రమాదముందన్నారు.

◆ అదే విధంగా నాలా విస్తరణలో భాగంగా కొన్ని ఇళ్లు అప్పట్లో కూల్చివేశామన్నారు. ఇప్పటి వరకు వారికి ఇల్లు కట్టుకోవడానికి నష్టపరిహారం కూడా అందజేయలేదని మంత్రి దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. అసంపూర్తిగా ఉన్న నాలా పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు తగు చర్యలు చేపట్టాలని కోరామన్నారు. తాము విన్నవించిన సమస్యకు సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు వెంటనే తగు చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో అఖిల్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మూసాపేట: పవర్‌నగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ శంకర్ తెలిపారు. పవర్‌నగర్, శివశంకర్ నగర్, మూసాపేట ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు.. ఇందు విల్లాస్, ఇందు అపార్టుమెంట్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

కూకట్‌పల్లి: వివేకానందనగర్‌లోని వడ్డేపల్లి రాజేశ్వరరావు స్వగృహంలో బుధవారం వీర శైవ లింగాయత్ సమాజం సభ్యులు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం రాజేశ్వరరావు వీర శైవ లింగాయత్ సమాజం 2024 కేలండర్‌ను ఆవిష్కరించారు. రాజేశ్వరరావుకు నాయకులు నూతన సంవత్సర డైరీని బహూకరించారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్రకు సంబంధించిన వాహనాల స్టిక్కర్‌ని ఆవిష్కరించి వాహనాలకు అంటించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి రాహుల్ గాంధీ చేపడుతున్న యాత్రను అన్నివర్గాల ప్రజలు ఆదరిస్తున్నారని తెలిపారు.

చెట్ల కొమ్మల తొలగింపు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లోని శ్రీవివేకానందనగర్‌లో బుధవారం విద్యుత్ తీగలకు అడ్డంగా ఉండి విద్యుత్‌కు అంతరాయం కలిగిస్తున్న చెట్ల కొమ్మలను విద్యుత్ అధికారులు తొలగించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ సబిహా బేగం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చెట్ల కొమ్మలు పెరిగి విద్యుత్ తీగలకు అనుకొని ఉండటంతో అంతరాయం కలిసి ఈదురు గాలులు వీస్తున్నప్పుడు షార్ట్ సర్క్యూట్‌కు గురై ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా విద్యుత్ తీగలను తొలగిస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి శ్రీవివేకానందనగర్‌లోని చెట్ల కొమ్మలను తొలగించారన్నారు.

అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తా

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్‌లోని రామకృష్ణనగర్ బస్తీవాసులు బుధవారం శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను బస్తీవాసులు ఆయనకు వివరించారు. అదే విధంగా ఆటో కార్మికులను సమస్యలను విన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జగదీశ్వర్‌గౌడ్ హామీ ఇచ్చారు. అధికారులతో మాట్లాడి వివేకానందనగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. డివిజన్‌లో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ఆల్విన్‌కాలనీ: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రంగారెడ్డి జిల్లా బ్రాంచ్ ఆధ్వర్యంలో బుధవారం ఎల్లమ్మబండ తారక్‌రామ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ముఖ్య అతిథిగా ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ హాజరై స్వయంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీపీ, షుగర్, సాధారణ పరీక్షలు అందజేస్తూ అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించిన సొసైటీ వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య నిపుణులు అందిస్తున్న సలహాలు పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సమ్మడ్, జగదీష్, ఖాజా, పోశెట్టి గౌడ్, కటికరవి, రమేష్ సాగర్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.